సీఎం జగన్‌కే ప్రజల దీవెనలు




డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్ : మోటారు ట్రై సైకిళ్లను పంపిణీ చేసి జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి

- రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు కుమ్మక్కు
- ఎంతమంది కలిసి వచ్చినా విజయం మనదే
- అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి జోగి రమేష్

పెడన: రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు కుమ్మక్కు అవుతున్నాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. బుధవారం సాయంత్రం పెడన పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ప్రారంభించారు. రూ.95 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, పైడమ్మ లే అవుట్ వైఎస్సార్ కాలనీలో ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ లైన్‌కు, నూతనంగా జగనన్న కాలనీకి ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌కు స్విచ్ ఆన్ చేసి విద్యుత్ సరఫరా చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ రైతుల వద్దకే అన్ని సేవలు అందించాలనే సంకల్పంతో రైతు భరోసా కేంద్రాలను తీసుకువచ్చి వారికి ఆర్థిక భారం తగ్గించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. వైద్యులు కూడా ఇంటింటికి వెళ్తూ ఆరోగ్య సమాచారం సేకరించడంతో పాటు వైద్య సేవలను అందించేలా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా వైద్య సేవలను అందించాలనే సంకల్పంతో అందుబాటులోకి డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్లను తీసుకువచ్చారని తెలిపారు. ప్రజారంజక పాలన చేస్తుంటే నచ్చని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు సింగిల్‌గా ఎన్నికలకు వెళితే ఉపయోగం ఉండదని గుర్తించి కలిసి పోటీ చేయడానికి సిద్ధమవుతున్నాయన్నారు. నెంబర్ వన్ మ్యానిఫెస్టో అంటూ చంద్రబాబు వస్తున్నాడని, దానిని చించి ముక్కలు చేసి ప్రజలు నిలదీయాలని పేర్కొన్నారు. గతంలో ఏం చేశారు.. ఇప్పుడు ఏం చేస్తారని ప్రశ్నించాలన్నారు. పేదలకు ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వని చంద్రబాబు.. జగన్ ప్రభుత్వం ఇచ్చిన స్థలం సరిపోదని అంటున్నారని విమర్శించారు. చంద్రబాబు స్థలం ఇస్తాడో.. ఇవ్వడో కూడా చెప్పకుండా ప్రగల్భాలు పలుకుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి, వైస్ చైర్మన్లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, ఫ్లోర్‌లీడర్ కటకం ప్రసాద్, డీపీఎం సుదర్శనరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ట్రై మోటారు సైకిళ్ల పంపిణీ..

పెడన నియోజకవర్గంలోని అర్హులైన 11 మందికి ట్రై మోటరు సైకిళ్లను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అందజేశారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పెడన మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో మోటరు సైకిళ్లను పంపిణీ చేశారు. ఒక్కో మోటరు సైకిల్ ధర రూ.95 వేలు అని, వీటిని సక్రమంగా వినియోగించుకోవాలని మంత్రి వారికి సూచించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ వి. కామరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోత్స్నరాణి, ఎంపీపీలు మధుసూదనరావు, గరుడ ప్రసాద్, చినబాబు, జెడ్పీటీసీ వేముల రంగబాబు, మండల కన్వీనర్లు నాగబాబు, రాజబాబు, మల్లికార్జునరావు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు వెంకటరామానాయుడు, అచ్యుతరావు, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు పాలన చేరువ చేసిన జగన్

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెదపాలెం(నాగాయలంక): సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, ఫ్యామిలీ డాక్టర్ తదితర వ్యవస్థలను గ్రామీణ ప్రజల ముంగిటకు తీసుకొచ్చి పాలన చేరువ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. నాగాయలంక మండలం ఏటిమొగ సచివాలయం పరిధిలోని పెదపాలెం గ్రామంలో బుధవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 425 గృహాలకు తిరిగి సంక్షేమ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేశారని చెప్పారు. పథకాల అమలు విషయంలో ఎవరికీ అన్యాయం జరగదని, అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరిందని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), మాజీ సర్పంచి నంద్యాల కోటేశ్వరరావు, బర్రంకుల పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

అధైర్య పడకండి.. పార్టీ అండగా ఉంటుంది

మంత్రి జోగి రమేష్



గాంధీనగరంలో తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను: ఎవరూ అధైర్య పడవద్దు.. పార్టీతో పాటు నేను కూడా అండగా ఉంటానని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీకి చెందిన గృహ సారథి జన్యావుల తులసీరావు మృతిచెందారు. మంత్రి జోగి రమేష్ మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి మీకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం మంత్రి చెరుకుమిల్లిలో ఇటీవల మృతిచెందిన పట్టపు నాంచారయ్య కుటుంబ సభ్యులు శ్రీనివాసరావు, రమేష్‌లను పరామర్శించారు. తొలుత మంత్రి లక్ష్మీపురం, పల్లెపాలెం గ్రామాల్లోని పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఇటీవల బదిలీపై వెళుతున్న పంచాయతీ కార్యదర్శులు మార్కండేశ్వరరావు, రామసుబ్బారావులను మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇన్‌చార్జీల నియామకం

మోపిదేవి: పంచాయతీ శాఖలో గ్రామ కార్యదర్శుల బదిలీల స్థానంలో ఇన్‌చార్జీలను నియమించామని ఎంపీడీఓ పార్వతి తెలిపారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పెదప్రోలు పంచాయతీ కార్యాలయం నుంచి గ్రామ కార్యదర్శి పేర్ని మాధవేంద్రరావు చల్లపల్లి పంచాయతీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో మోపిదేవి గ్రామ కార్యదర్శి కె. త్రిపుర సుందరి ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. కె. కొత్తపాలెం, వెంకటాపురం పంచాయతీలకు ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శిగా కె. రామకోటేశ్వరరావును నియమితులయ్యారని ఎంపీడీఓ వివరించారు.

20న సీజ్ చేసిన వాహనాలకు వేలం

కోనేరుసెంటర్: పన్ను చెల్లించకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు సీజ్ చేసిన వాహనాలకు ఈనెల 20వ తేదీన గన్నవరం ఆర్టీసీ డిపోలో వేలంపాట నిర్వహిస్తామని జిల్లా రవాణా శాఖాధికారి సీతాపతిరావు బుధవారం తెలిపారు. రూ. 2000 ధరావతు చెల్లించి వేలంపాటలో పాల్గొనవచ్చని చెప్పారు. వేలంపాటలో వాహనాలను దక్కించుకునే అభ్యర్థులు జీఎస్టీతో కలిపి అదే రోజు డబ్బులు మొత్తం చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పాఠ్య పుస్తకాలు అందజేత



నాగాయలంక: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ లో చేరిన ఇంటర్మీడియట్ విద్యార్థినులకు బుధవారం ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరం బైపీసీ గ్రూపులో 18 మంది, ఎంపీసీ గ్రూపులో 23 మంది ప్రవేశం పొందగా తొలి విడతగా వీరిలో 24 మంది బాలికలకు పాఠశాల ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ వనమా రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఇంటర్మీడియట్ అధ్యాపక బృందం, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

కలంకారీ శిక్షణ తరగతులు ప్రారంభం



గూడూరు: చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామంలో కలంకారీలో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. విజయవాడ వీవర్స్ సర్వీస్ సెంటర్ డీడీ అనిల్ సాహూ శిక్షణా తరగతులను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. సమర్థన్ యోజనలో భాగంగా చేనేత అనుబంధ వృత్తుల్లో వృత్తి నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. తద్వారా ఉపాధి, మార్కెటింగ్ వ్యవస్థను పటిష్ట పరచాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. గ్రామంలోని చేనేత సంఘాలకు చెందిన 40 మంది సభ్యులకు 15 రోజుల పాటు కలంకారీలో శిక్షణ ఇస్తామని చెప్పారు. శిక్షణా కాలంలో స్టైఫండ్‌తో పాటు శిక్షణ పూర్తి చేసుకున్న కార్మికులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు. చేనేత అభివృద్ధి అధికారి డి.శ్రీనివాస్, సర్పంచి యక్కల మాధవి, చేనేత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్ ఇనగుదురుపేటకు చెందిన షేక్ సలీం ఇటీవల మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరైన రూ. 10 వేలను వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్ బుధవారం మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు అలీ, రహీం, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పైకప్పు నిర్మాణ సామగ్రి వితరణ



మచిలీపట్నంటౌన్: ఇంటి పైకప్పు నిర్మాణానికి రెండు పేద కుటుంబాల వారికి బెరాకా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుధవారం సామగ్రిని అందజేశారు. క్యాంప్‌బెల్‌పేటకు చెందిన తిరుమాని నాగపుష్ప, చిప్పల లక్ష్మీల గృహాల పైకప్పులు ఇటీవల ఈదురుగాలులు, పిడుగుపాటుకు ధ్వంసమయ్యాయి. దీంతో వారు బెరాకా మినిస్ట్రీస్ నిర్వాహకుడు కిరణ్‌పాల్‌ను కలిసి విషయం తెలిపారు. స్పందించిన కిరణ్‌పాల్ ఇంటి పైకప్పు ఏర్పాటుకు అవసరమైన ఇనుప పైపులు, రేకులను బుధవారం బాధితులకు అందజేశారు. సాయం అందించిన కిరణ్‌పాల్‌కు బాధిత మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.

వేటకు వేళాయె!

బుధవారం అర్ధరాత్రితో ముగిసిన నిషేధాజ్ఞలు



పాలకాయతిప్పలో వలలను సిద్ధం చేస్తున్న మత్స్యకారులు

కోడూరు(అవనిగడ్డ): చేపల వేట నిషేధాజ్ఞలు పూర్తి కావడంతో గంగపుత్రులు తిరిగి సముద్రంలో వేటకు వెళ్లేందుకు సమాయత్తమయ్యారు. సముద్రంలో చేపలు సంతానోత్పత్తి చెందే సమయమైన ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు కేంద్ర ప్రభుత్వం సముద్రంలో వేట నిషేధాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం అర్ధరాత్రితో 61 రోజుల వేట నిషేధ సమయం ముగియడంతో గురువారం నుంచి మత్స్యకారులు యథావిధిగా వేటకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

దివిసీమలో సిద్ధమైన 1,304 బోట్లు..

దివిసీమలోని నాగాయలంక, కోడూరు, అవనిగడ్డ మండలాల్లో సుమారు 30 వేల మత్స్యకారులు ఉన్నాయి. అయితే వీరిలో 15 వేల మంది ప్రత్యక్షంగా చేపల వేట ఆధారంగానే జీవనం సాగిస్తున్నారు. మూడు మండలాల్లో 1,304 లైసెన్స్ కలిగిన వేట బోట్లు ఉండగా, వీటితో పాటు మరో 500లకు పైగా సంప్రదాయ పడవలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం నిషేధ కాలంలో మత్స్యకారులు బోట్లను ఒడ్డుకు చేర్చి ఇళ్లకే పరిమితమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకార భరోసా కింద ప్రతి కుటుంబానికి రూ.10 వేల నగదును అందించి వీరికి తోడ్పాటునిచ్చారు.

సిద్ధమైన పడవలు, వలలు..

గురువారం నుంచి మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మంగళ, బుధవారాల్లో దశమి గడియలు ఉండటంతో మత్స్యకారులు తమ పడవలకు పూజలు చేశారు. వలలు, డీజిల్, తాగునీటి వంటివి సమకూర్చుకున్నారు. మత్స్యశాఖ అధికారులు బోట్లకు సంబంధించిన ఎన్యూమరేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేసి, మత్స్యకారులు వేట సమయంలో అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ముగ్గురు యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న దాతలు

నాగాయలంక: ప్రపంచ రక్తదాతల దినోత్సవం రోజునే ఓపెన్ హార్ట్ సర్జరీ పేషెంట్‌కు లైవ్ రక్తదానం చేయవలసిన అవకాశం ముగ్గురు మిత్రులకు దక్కింది. నాగాయలంక సమీపంలోని మర్రిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల ఉపాధ్యక్షుడు మద్ది కొండలు ఓపెన్ హార్ట్ సర్జరీ నిమిత్తం విజయవాడలోని రమేష్ ఆస్పత్రిలో చేరాడు. బుధవారం సర్జరీ జరుగుతున్నందున పేషెంట్‌కు ఓ పాజిటివ్ లైవ్ రక్తం మూడు యూనిట్లు అవసరం అవుతుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నాగాయలంక సబ్ బ్రాంచ్ చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్‌ను సంప్రదించారు. స్పందించిన అతని మరో ఇద్దరు మిత్రులు గాజుల కిశోర్, బండ్రెడ్డి లీలాకృష్ణలను తీసుకుని విజయవాడ చేరుకుని పేషెంట్‌కు అవసరమైన రక్తం అందించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం రోజునే తమకు ఈ అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నామని ముగ్గురు మిత్రులు తెలిపారు. దాతలను సంస్థ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

ఏపీ ఈఏపీసెట్‌లో మచిలీపట్నం విద్యార్థుల హవా



వేమూరి సాయిలోకేష్



ఆళ్ల వెంకట లక్ష్మీ శ్రియ రెడ్డి




తుమ్మల వెంకట సాయిసాత్విక్



మొహమ్మద్ సైఫుల్లా

మచిలీపట్నంటౌన్: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో మచిలీపట్నానికి చెందిన నలుగురు విద్యార్థులు ప్రతిభ చూపారు. రాష్ట్ర స్థాయితో పాటు జిల్లా స్థాయిలో మంచి ర్యాంకులను సాధించారు. ఇంజినీరింగ్, ఫార్మసీ విభాగంలో వేమూరి సాయిలోకేష్ రాష్ట్ర స్థాయిలో 110వ ర్యాంకును, జిల్లా స్థాయిలో 7వ స్థానాన్ని సాధించాడు. అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ విభాగంలో మచిలీపట్నానికి చెందిన ఆళ్ల వెంకటలక్ష్మీ శ్రియరెడ్డి రాష్ట్ర స్థాయిలో 128వ ర్యాంకుతో పాటు జిల్లా స్థాయిలో మూడో స్థానాన్ని సాధించింది. ఈమె తండ్రి భాస్కర రెడ్డి కంటి వైద్యుడిగా, తల్లి అరుణకుమారి రేడియాలజిస్టుగా పనిచేస్తున్నారు. అలాగే తుమ్మల వెంకట సాయిసాత్విక్ రాష్ట్రస్థాయిలో 167 ర్యాంకును, జిల్లా స్థాయిలో ఐదో స్థానాన్ని పొందాడు. మొహమ్మద్ సైఫుల్లా రాష్ట్ర స్థాయిలో 195వ ర్యాంకు, జిల్లా స్థాయిలో 6వ స్థానాన్ని సాధించాడు.

చల్లపల్లి విద్యార్థి ఉమేష్ శ్రీచంద్రకు స్టేట్ ర్యాంక్



కాకరపర్తి ఉమేష్ శ్రీచంద్ర

చల్లపల్లి: ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో చల్లపల్లికి చెందిన విద్యార్థి కాకరపర్తి ఉమేష్ శ్రీచంద్ర రాష్ట్ర స్థాయిలో 283వ ర్యాంక్ సాధించాడు. స్థానిక పొట్టి శ్రీరాములు వీధికి చెందిన కాకరపర్తి హేమ వెంకట నాగగోపాల్–లక్ష్మీ అర్పిత దంపతుల రెండవ కుమారుడు ఉమేష్ శ్రీచంద్ర పదో తరగతిలో 10/10 సాధించాడు. ఇంటర్ బైపీసీ గ్రూపులో 957 మార్కులు సాధించాడు. బైపీసీలో లభించిన ఉత్తమ ఫలితాలతో నీట్ ప్రవేశ పరీక్షకు హాజరై ఆలిండియా స్థాయిలో 77,526వ ర్యాంకు సాధించాడు. తండ్రి సూచన మేరకు ఏపీ ఈఏపీ సెట్‌కు కూడా హాజరైన ఉమేష్ శ్రీచంద్ర అందులోనూ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి 283వ ర్యాంకు సాధించాడు.

పరిశోధన పట్ల ఆసక్తి..

చిన్నతనం నుంచి పరిశోధనా రంగం అంటే నాకు ఆసక్తి అని, అందుకే బైపీసీలో చేరానని ఉమేష్ శ్రీచంద్ర అన్నారు. నీట్, ఈఏపీ సెట్‌లో ఉత్తమ ర్యాంకులు వచ్చిన నేపథ్యంలో నాకు ఆసక్తి కలిగిన పరిశోధనా రంగం వైపు వెళ్లేందుకు నీట్ ద్వారా వచ్చిన కోర్సులో చేరుతానని చెప్పాడు.

ఉద్యాన రైతులకు అవగాహన

గన్నవరం రూరల్: మండలంలోని మాదలవారిగూడెం గ్రామ సచివాలయం వద్ద బుధవారం ఉద్యానవన రైతులకు అవగాహన కార్యక్రమం హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్ నిర్వహించారు. ప్రభుత్వం ఉద్యాన పంటల ప్రోత్సాహానికి సబ్సిడీలు అందజేస్తోందని, వాటిని వినియోగించుకోవాలన్నారు. సూక్ష్మ సేద్యం ద్వారా డ్రిప్ ఇరిగేషన్‌ను ప్రోత్సహిస్తోందన్నారు. సచివాలయం కార్యదర్శి రాజశేఖర్, హెచ్ఏ దీక్షా, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం



ముంజులూరు ఉన్నత పాఠశాలలో కిట్లు అందుకున్న విద్యార్థులతో ఎంపీపీ



జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ రత్నకుమారి



గూడూరులో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ మధుసూదనరావు

కృత్తివెన్ను: పేద వర్గాలకు చెందిన పిల్లల ఉజ్వల భవిష్యత్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాటలు వేస్తున్నారని కృత్తివెన్ను జెడ్పీటీసీ మైల రత్నకుమారి అన్నారు. బుధవారం జగనన్న విద్యా కానుక కిట్లను లక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో ఆమె విద్యార్థులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌తో పాటు, నాణ్యమైన మూడు జతల యూనీఫాం, షూస్ తదితర వస్తువులను కిట్ రూపంలో అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఉపాధ్యాయులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ ..

బంటుమిల్లి: ముంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను ఎంపీపీ వి. చినబాబు బుధవారం పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఎంఈఓ కేఎస్‌వీ ప్రసాద్ మాట్లాడారు. మండలంలోని పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, ఏఎంసీ వైస్ చైర్మన్ పి. బాబూరావు, మండల సచివాలయాల కమిటీ చైర్మన్ కె. సుబ్బారావు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు ఎం. రాజబాబు, సర్పంచ్ బి. రమేష్, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

గూడూరు: విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లను బుధవారం స్థానిక మండల పరిషత్ మెయిన్ పాఠశాలలో విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గౌరిపర్తి రవికుమార్, మోటేపల్లి రత్నారావు, నందం రవికిరణ్, అట్లూరి వెంకటేశ్వరరావు, లింగం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలపటంలో..

మండంలోని కలపటం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు జేవీకే కిట్లను పంపిణీ చేశారు. సర్పంచి ఐనాల దేవనాగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను పరిశీలించిన ముంబై బృందం

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, పాఠశాలల అభివృద్ధి తదితర అంశాలు పరిశీలించటానికి ముంబై నుంచి ప్రతినిధి బృందం బుధవారం మండలంలో పర్యటించారు. తొలుత బృంద సభ్యులు పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు కింద జరిగిన అభివృద్ధి పనులు తిలకించారు. పాఠశాల తరగతి గదుల్లో మౌలిక వసతులు, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరు ముద్ద, అమ్మ ఒడి, అటల్ టింకరింగ్ ల్యాబ్‌ను పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రతినిధి బృందం సభ్యుడు గౌరవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్యా విధానం ప్రవేశ పెట్టడం వలన విద్యార్థులకు చాలా మేలు జరుగుతుందన్నారు. అనంతరం బృందం వణుకూరులోని జగనన్న కాలనీలో గృహాలు, సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. సచివాలయం ద్వారా అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు అడిగి తెలుసుకున్నారు. రైతు భరోసా కేంద్రంతో రైతులకు అందుతున్న సేవలు పరిశీలించారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునీతా శర్మ, ఏఓ లోయ శివ శంకరరావు, హెచ్ఎం వై.దుర్గాభవాని, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సీఎం జగన్ పర్యటన పోస్టర్ల ఆవిష్కరణ




పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన టిడ్కో గృహాలను ప్రారంభించేందుకు గుడివాడ మండలం మల్లాయపాలెం వస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను దిగ్విజయం చేయాలని ఎంపీపీ గద్దె పుష్పరాణి అన్నారు. సీఎం పర్యటన పోస్టర్లను ఆవిష్కరించారు. మండలంలోని దొండపాడు, సైదేపూడి, మోటూరు, చౌటపల్లి, శేరీగొల్వేపల్లి, లింగవరం, బిళ్లపాడు, రామనపూడి, గుంటాకోడూరు గ్రామాల్లో జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్‌లతో కలిసి విస్తృతంగా బుధవారం పర్యటించారు. నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, వలంటీర్లతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా వదిలేసిన టిడ్కో గృహాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని శరవేగంగా సకల వసతులతో నిర్మించిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) గృహాల నిర్మాణాలు పూర్తి కావడానికి మౌలిక వసతుల కల్పనకు విశేషంగా కృషి చేయడం హర్షణీయమన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు విక్టర్ మాట్లాడుతూ వేలాదిమందికి గుడివాడలో సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే కొడాలి నానిలకే దక్కుతుందన్నారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఆహ్వానాలు పలికారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ మేకల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు గద్దె రాము, అంగడాల వెంకట నారాయణ, ఎంపీటీసీ సభ్యుడు అంగడాల శ్రీరామాంజనేయులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లకు సత్కారం

ఉంగుటూరు: వలంటీర్లు మరింత ఉత్సాహంగా పని చేయాలని ఎంపీడీఓ శేషగిరిరావు అన్నారు. వేంపాడు సచివాలయంలో 14 మంది వలంటీర్లకు ప్రశంసా పత్రాలు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడంలో వలంటీర్లు కీలక పాత్ర వహిస్తున్నారని తెలిపారు. వలంటీర్లు సమర్థవంతంగా పని చేయాలని సూచించారు. అనంతరం వలంటీర్లకు సర్టిఫికెట్లు, బ్యాడ్జ్‌లను అందజేసి శాలువాలతో సన్మానించారు. వేంపాడు, చాగంటిపాడు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ వైద్యశాలకు నాగమల్లేశ్వరరావు భౌతికకాయం



అవనిగడ్డ: అవనిగడ్డ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ వంగర శేషగిరిరావు సోదరుడు నాగమల్లేశ్వరరావు మరణానంతరం భౌతిక కాయాన్ని మంగళగిరి ఎన్‌ఆర్‌ఐ వైద్యశాలకు అప్పగించారు. నాగమల్లేశ్వరరావు మంగళవారం రాత్రి మంగళగిరిలోని తన స్వగృహంలో మృతిచెందారు. నాగమల్లేశ్వరరావు తన మరణానంతరం భౌతికకాయాన్ని డాక్టర్ల రీసెర్చ్‌కు ఉపయోగపడేలా వైద్యశాలకు అప్పగించాలని కోరడంతో భౌతిక కాయాన్ని ఎన్‌ఆర్‌ఐ వైద్యశాలకు, నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు దానం చేశారు.

యోగాశక్తితో సయాటికా నివారణ

పెనమలూరు: యోగాశక్తితో సయాటికాకు విముక్తి లభిస్తుందని డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు. కానూరు అశోక్‌నగర్‌లోని ఇండియన్ ఓం కార్యాలయంలో యోగాశక్తి సాధన సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం యోగాశక్తితో సయాటికా పూర్తిగా నివారించవచ్చని అవగాహన సదస్సు నిర్వహించారు. సయాటికాకు మూత్రనాడి, గాల్‌బ్లాడర్ నాడిలో వచ్చు హెచ్చు తగ్గులే కారణమన్నారు. వ్యాధి ఉన్న వారు ప్రతి రోజూ ప్రాణాయామం చేసి నాణ్యమైన ఆహారం తీసుకోవాలని సూచించారు.